ఊగుతున్న ఊర్లు..!

- జిల్లాలో యథేచ్ఛగా మైనింగ్
- క్వారీల్లో ఇష్టారీతిన బ్లాస్టింగ్
- ఇళ్లకు బీటలు, ప్రమాదకరంగా క్వారీలు
- పట్టించుకోని అధికారులు



ఇది కౌటాల మండలం ముత్తంపేట –పార్డీ రోడ్డు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూతపడిన క్వారీ. ప్రస్తుతం క్వారీలో నీళ్లు నిండడంతో ప్రమాదకరంగా ఉంది. క్వారీ చుట్టూ ఎలాంటి కంచె కూడా ఏర్పాటు చేయలేదు. దీనిని గమనించకుండా క్వారీవైపు మూగజీవాలు, మనుషులు వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. మూతపడిన క్వారీ చుట్టూ కంచె ఏర్పాటు చేయాల్సి ఉన్నా క్వారీ యజమానులు పట్టించుకోకపోవడం గమనార్హం.



ముత్తంపేట సమీపంలోని భారీ క్వారీ



స్టోన్‌క్రషర్ల సమీపంలో పత్తి పంటపై పడిన దుమ్ము

కౌటాల: మండలంలోని స్టోన్ క్రషర్లలో నిర్వహిస్తున్న భారీ బ్లాస్టింగ్‌లతో సమీప ఊర్లు ఊగుతున్నాయి. ప్రతీరోజు ఉదయం, రాత్రి బ్లాస్టింగ్‌లతో గ్రామాల్లో భూకంపం వచ్చినట్లు అవుతోంది. ఇళ్లలోని వస్తువులు కిందపడుతున్నాయి. స్థానికులు ఇళ్లల్లో నుంచి బయటకు పరుగులు తీస్తున్నారు. పేలుడ్ల తీవ్రతకు కొన్నిసార్లు బండరాళ్లు క్వారీల చుట్టుపక్కల పొలాల్లో పడుతున్నాయి. మరోవైపు క్వారీ టిప్పర్ల చోదకులు ఇష్టారీతిగా అతివేగంతో వాహనాలు నడుపుతుండటంతో తరచూ ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి.

రోజూ భూకంపమే..

క్వారీల్లో రోజూ కంకర కోసం బ్లాస్టింగ్ చేస్తుండటంతో సమీపంలో గల వ్యవసాయ బోర్లు పూడిపోయి నీళ్లు రాకపోవడంతో పంటలు పండించుకునే పరిస్థితి లేకుండా పోయింది. బ్లాస్టింగ్‌తో చుట్టూ కిలోమీటర్ దూరం వరకు భూమి కంపించడంతో పాటు సమీపంలో గల పంట పొలాల్లో పెద్ద రాళ్లు ఎగిరి పడుతున్నాయి. స్థానికుల ఇళ్లకు బీటలు వస్తున్నాయి. క్రషర్ల నుంచి వచ్చే దుమ్ముతో మొక్కలు, పంటలు నల్లగా మారుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీల్లో యజమానులు ఇష్టారీతిలో తవ్వకాలు చేపడుతున్నారు. లీజుకు తీసుకున్న భూమితో పాటు అదనంగా ఆక్రమించి రాళ్లను తీస్తున్నారు. తవ్వి తీసిన రాళ్ల పరిమాణానికి, తరలించడానికి పర్మిట్లు తీసుకున్న విస్తీర్ణానికి భారీగా వ్యత్యాసం ఉంటోంది. ప్రభుత్వానికి రావాల్సిన పన్ను ఎగవేస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు..

క్వారీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. ఇప్పటికే మైనింగ్ కోసం తీసుకున్న స్థలాల్లో భారీగా మైనింగ్ చేపట్టారు. 100–150 మీటర్ల లోతు వరకు తవ్వుతున్న కంకర క్వారీలను గడువు తీరిన వెంటనే నిబంధనల మేరకు పూడ్చి వేయాలి. అక్కడకు ఎవరూ వెళ్లకుండా తవ్విన ప్రదేశం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. తవ్వి అలాగే వదిలేస్తుండడంతో సమీప గ్రామాల ప్రజలు, మూగజీవాలు అందులో పడి విగతజీవులుగా మారుతున్నాయి. ముత్తంపేటలో మూతపడిన క్వారీలు నీళ్లతో నిండి ప్రమాదకరంగా ఉన్నాయి. జిల్లాలో 10 కంకర క్వారీలు ఉండగా 13 స్టోన్ క్రషర్లు ఉన్నాయి. ఇటీవల జిల్లాలోని అన్ని కంకర క్వారీలు, క్రషర్లలో గనుల శాఖ ప్రత్యేక అధి కారుల ఆధ్వర్యంలో సర్వే చేశారు. ప్రతీచోట రూ. లక్షల్లో పన్నులు చెల్లించలేదని అధికారులు గుర్తించారు. నిబంధనలు పాటించని క్రషర్ యజమానులకు అధికారులు భారీ జరిమానా విధించినట్లు తెలుస్తోంది.

రోజూ భయమే..

మా గ్రామ సమీపంలో స్టోన్ క్రషర్లు, క్వారీలు ఉన్నాయి. క్వారీల్లో బ్లాస్టింగ్ నిర్వహించినప్పుడు పెద్ద శబ్దం రావడంతో పాటు ఇళ్లల్లోని వస్తువులు కదులుతున్నాయి. దీంతో ప్రతిరోజు భయంగానే ఉంటున్నాం. ఇళ్ల గోడలకు బీటలు వస్తున్నాయి. బ్లాస్టింగ్ సమయంలో పంట పొలాల్లో పెద్ద బండ రాళ్లు పడుతున్నాయి. పంటలపై దుమ్ము, దూళి పడుతోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– సంతోష్, ముత్తంపేట, మం.కౌటాల

క్వారీలపై నిఘా పెంచాం

స్టోన్ క్రషర్ల నిర్వాహకులు నిబంధనల ప్రకారం బ్లాస్టింగ్ నిర్వహణ, కంకర తరలించాలని క్వారీ యజమానులను ఆదేశించాం. క్వారీల నిర్వాహకులు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లిస్తున్నారు. నిబంధనల మేరకు క్వారీ తవ్వకాలు జరపడంతో పాటు వాహన సామర్థ్యం మేరకే కంకర తరలించకుంటే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం. క్వారీల నిర్వహణపై సర్వే చేస్తున్నాం. జిల్లాలోని అన్ని క్వారీలపై నిఘా పెంచాం. క్వారీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి.

– గంగాధర్, గనులశాఖ అధికారి, ఆసిఫాబాద్

గ్రామాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

దహెగాం: గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని సిర్పూర్ (టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. మండలంలోని పార్వతిపేట గ్రామంలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం, మండల కేంద్రంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, పీపీరావు కాలనీ, కల్వాడ గ్రామ పంచాయతీలలో పంచాయతీ భవనాల నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్ కింద గ్రామాల అభివృద్ధికి సీసీరోడ్లు, పంచాయతీ భవనాల కోసం నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, నాయకులు తోట చందు, దెబ్బడి సత్యం, బండ చందు కేదర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మహాసభలు జయప్రదం చేయాలి'

వాంకిడి: సంగారెడ్డిలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే సీపీఎం పార్టీ 4వ రాష్ట్ర మహాసభలను జయప్ర దం చేయాలని పార్టీ జిల్లా కా ర్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. నాయకులు కార్తిక్, నిఖిల్, తిరుపతి, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ



విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో బెజ్జూర్ జెడ్పీఎస్ఎస్, సలుగుపెల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సునీత మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుమ్ముల శ్రీనివాస్, షేఖ్ముఖ చారి తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలో ఉండాలి



బడి బయట పిల్లలను గుర్తిస్తున్న సీఆర్పీ సుభాష్

ఆసిఫాబాద్‌రూరల్: బడీడు పిల్లలు బడిలో ఉండాలని ఎంఈవో సుభాష్ అన్నారు. మంగళవారం మండలంలోని గురుగూడి గ్రామంలో సీఆర్పీ సుభాష్‌తో కలిసి బడి బయట పిల్లలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలను బడిలో చేర్పించేలా సీఆర్పీలు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా మండలంలోని సీఆర్పీలు తమ పరిధిలోని గ్రామాల్లో సర్వే నిర్వహించారు.

నిల్వ ఉన్న పత్తి దగ్ధం



మంటలు ఆర్పుతున్న స్థానికులు

కౌటాల: మండలంలోని కనికి గ్రామానికి చెందిన బుర్రి బాపన్న ఇంట్లో నిల్వ ఉన్న పత్తి మంగళవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం బాపన్న ఇంటికి తాళం వేసి పత్తి తీయడానికి చేనుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇంట్లో నిల్వ ఉన్న పత్తికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు గమనించి ఇంట్లోకి వెళ్లి పత్తిపై నీళ్లు చల్లి మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో మూడు క్వింటాళ్ల పత్తి పూర్తిగా కాలిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

బీఆర్ఎస్ నియోజకవర్గ మహిళా కన్వీనర్‌గా విమల



సన్మానిస్తున్న ప్రవీణ్‌కుమార్

సిర్పూర్(టి): సిర్పూర్(టి) నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మహిళా కన్వీనర్‌గా కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన చునార్కర్ విమల నియమితులయ్యారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమలను శాలువాతో ఘనంగా సన్మానించారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కోనేరు కోనప్ప

సిర్పూర్(టి): మండలంలోని లోనవెల్లి గ్రామం కోనేరు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్టాపన కోసం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బౌద్ధ గురువు భదంత్ దమ్మా సారధి ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

నిరుపయోగంగా నిఘా నేత్రాలు

- అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు



అలంకారప్రాయంగా మారిన సీసీ కెమెరాలు

తిర్యాణి: మండలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో నిఘా వ్యవస్థ పూర్తిగా కొరవడుతోంది. ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పోలీసులు అవగాహన కల్పించి మండలంలోని పలు కూడళ్ల వద్ద, దుకాణాల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. కొన్నిచోట్ల సీసీ కెమెరాలు పని చేస్తున్నా కొన్ని ప్రాంతాల్లో మాత్రం సరైన నిర్వహణ చేపట్టకపోవడంతో కొన్నేళ్లకే నిరుపయోగంగా మారాయి. ఈ నేపథ్యంలో ×సాక్షి × ×పని చేయని నిఘా నేత్రం పేరుతో కథనం ప్రచురించింది. దీంతో అప్పటి ఎస్సై మాధవ్ గౌడ్ స్పందించి ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు కొనుగోలు చేశారు. అయితే అనంతరం బదిలీపై వెళ్లగా మళ్లీ సీసీ కెమెరాల ఏర్పాటుపై ఆసక్తి చూపే వారు కరువయ్యారు. నూతనంగా కొనుగోలు చేసిన సీసీ కెమెరాల్లో కొన్నింటిని ఇప్పటికే పలు ముఖ్యమైన ప్రాంతాల్లో బిగించినప్పటికీ వాటికి పూర్తిస్థాయిలో కనెక్షన్ ఇవ్వకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి.

ఎన్నో ప్రయోజనాలు..

సీసీ కెమెరాలతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. పోలీసులు పలు కేసులు ఛేదించేందుకు నిఘా నేత్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయి. ప్రజల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలకు ఆదరణ పెరుగుతోంది. నేరాల నియంత్రణతో పాటు, నేరాల పరిశోధనలలోనూ పోలీసులకు అస్త్రాలుగా మారుతున్నాయి. నూతన వ్యక్తుల సంచారం, అసాంఘిక కార్యక్రమాలను అరికట్టడంతో వీటి పాత్ర ఎంతో కీలకమైనది. అలాంటి సీసీ కెమెరాలను మండలంలో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేరాల నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడే సీసీ కెమెరాలను క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసి వాటి నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకొస్తాం..

మండలంలోని ముఖ్యమైన కూడళ్ల వద్ద ప్రజల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. వీలైనంత త్వరగా సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకొస్తాం.

– శ్రీకాంత్, ఎస్సై

సమాచార హక్కు చట్టం కమిటీ ఎన్నిక



నియామక పత్రం అందజేస్తున్న కమలాకర్

ఆసిఫాబాద్‌రూరల్: సమాచార హక్కు రక్షణ చట్టం –2005 ఆసిఫాబాద్ మండల కమిటీని మంగళవారం జిల్లా కేంద్రంలో సమాచార హక్కు చట్టం సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమలాకర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమాచార హక్కు చట్టం సొసైటీ మండల అధ్యక్షుడు సుధాకర్, ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శి భీంరావు, సహాయ కార్యదర్శి జనార్ధన్, కోశాధికారి షేక్ జాఫర్ షరీఫ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్య ప్రజల వజ్రాయుధమని, సహచట్టంపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సమాచార చట్టం నియోజకవర్గం అధ్యక్షుడు రవిదాస్ పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి



చర్చిస్తున్న నాయకులు, అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏరియాలో నెలకొన్న సమస్యలకు అధికారులు సత్వర పరిష్కారం చూపాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ స్ట్రక్చర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు ఏరియాలోని సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. గోలేటిలో మినీ ఏసీ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయాలని, గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద మోటర్ బైక్ షెడ్డు పొడిగించాలని, గోలేటి డ్యూటీ బస్టాఫ్ వద్ద మోటర్‌బైక్ షెడ్డు చదును చేయాలని చేసి రోడ్డు వరకు ఫ్లోరింగ్ చేపట్టాలని కోరారు. ఏరియాసుపత్రిలో వారానికి ఒకసారి స్పెషలిస్టు డాక్టర్ క్యాంపు, గోలేటి పీఎంఈ సెంటర్‌లో అన్ని పరీక్షలు నిర్వహించాలన్నారు. గోలేటిలోని ఉద్యోగుల క్వార్టర్లకు సింటెక్స్ వాటర్ ట్యాంకులు, పైపులైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఖైరిగూడ ఓసీపీలో జనరల్ మజ్దూర్ ఉద్యోగులకు గదుల విస్తరణ, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. గోలేటి, మాదారం టౌన్‌షిప్‌ల్లో మోటర్లు, విడి పంపుసెట్లతో కొత్త పంపులు ఏర్పాటు చేయాలని, గోలేటి పరిసరాల్లో ఓసీపీలు, సీహెచ్‌పీ ఉన్నందున బెల్లంపల్లి ఏరియా పేరును గోలేటి ఏరియాగా మార్చాలన్నారు. ఏరియా పరిధిలోని సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని జీఎం శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఎస్వోటూజీఎం రాజమల్లు, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహరా, కృష్ణమూర్తి, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, స్ట్రక్చర్ కమిటీ సభ్యులు బయ్య మొగిళి, శేష శయన రావు, రాజేష్, ఆనంద్, జగ్గయ్య, మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అర్చకుల వేతనాలు విడుదల చేయాలి'

సిర్పూర్(టి): రాష్ట్ర వ్యాప్తంగా ధూపదీప నైవేద్య పథకంలో సేవలందిస్తున్న డీడీఎస్ అర్చకుల మూడు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ధూపదీప నైవేద్యం అర్చకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అర్చకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చాలీచాలని వేతనాలతో సేవలందిస్తున్న అర్చకుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని కోరారు.

ప్రజల సమక్షంలోనే లబ్ధిదారుల ఎంపిక

- ప్రారంభమైన గ్రామసభలు
- లబ్ధిదారుల జాబితా చదివి వినిపించిన అధికారులు
- పేర్లు రాని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచన



బెజ్జూర్: గ్రామసభలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి నదీమ్



దహెగాం: కల్వాడలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేందర్



పెంచికల్‌పేట్: లోడ్‌పల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు



రెబ్బెన: గ్రామసభలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ప్రభాకర్



సిర్పూర్ (టి): మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

బెజ్జూర్: ప్రజల సమక్షంలోనే ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేక అధికారి నదీమ్ అన్నారు. మంగళవారం బెజ్జూర్, కృష్ణపల్లి, అందుగులగూడ, రెబ్బెన, అంబగట్టు, లంబడిగూడ, కుంటలమానేపల్లి గ్రామపంచాయతీల్లో ఆయా గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులతో గ్రామసభలు ఏర్పాటు చేశారు. లిస్టులో పేర్లు రాని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో గౌరీ శంకర్, వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: అర్హులందరికి నాలుగు పథకాలు అందుతాయని తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేందర్‌లు అన్నారు. మంగళవారం మండలంలోని కల్వాడ, బీబ్రా, బొర్లకుంట, కుంచవెల్లి, కర్జి, తదితర గ్రామ పంచాయతీలలో నాలుగు గ్యారెంటీలపై గ్రామసభలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాల కోసం లబ్ధిదారుల సర్వే పూర్తి చేశామన్నారు. అర్హుల జాబితాను గ్రామసభలో గ్రామస్తుల సమక్షంలో చదివి వినిపించారు. జాబితాలో పేర్లు లేని వారు గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 24 వరకు గ్రామసభలు పూర్తి చేస్తామన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలకు ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. లోడ్‌పెల్లి, దరోగపల్లి, పోతెపెల్లి, బొంబాయిగూడ, అగర్‌గూడ గ్రామపంచాయతీలలో గ్రామసభలకు ప్రజలు దరఖాస్తులతో వచ్చారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సభల్లో మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రావు, ఎంపీడీవో ఆల్బర్ట్, ఎంఈవో రమేశ్ బాబు, ఏవో మనీషా, ఏఈ ఖదీర్, ఏఈవోలు విద్య, శివ, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెబ్బెన: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అందించడమే తమ లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్ అన్నారు. రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం మంగళవారం మండలంలోని రెబ్బెన, పులికుంట, గంగాపూర్, కిష్టాపూర్, లక్ష్మీపూర్, ధర్మారంలతో గ్రామ సభలు నిర్వహించారు.

నేడు గ్రామసభలు

వంకులం, జక్కులపెల్లి, ఇందిరానగర్, మాద్వాయిగూడ, రోళ్లపాడు, నంబాల గ్రామ పంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించనున్నారు.

సిర్పూర్(టి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు గ్రామాల్లోని అర్హులను గుర్తించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ అన్నారు. మండలంలోని వెంకట్రావ్‌పేట్, చింతకుంట గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. తహసీల్దార్ శ్రీనివాస్, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి గిరీషన్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభకు హాజరై మాట్లాడారు. అర్హులందరికీ పథకాలు వర్తింపజేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అర్హుల జాబితా చదివి వినిపించారు. అలాగే మండలంలోని ఎన్‌జీఓఎస్ కాలనీలో నిర్వహించిన గ్రామ సభకు కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా హాజరయ్యారు. అర్హుల జాబితా పారదర్శకంగా రూపొందించామని తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఎంపీడీవో రమేశ్, ఏపీవో బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో అవకాశాలు అందిపుచ్చుకోవాలి



ఉద్యోగ నియామక పత్రం ఇస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: సింగరేణి సంస్థ కల్పించే అవకాశాలు అందిపుచ్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. ఏరియాలో మెడికల్ ఇన్‌వాలిడేట్ అయిన ఇద్దరు ఉద్యోగుల వారసులకు మంగళవారం జీఎం కార్యాలయంలో నియామక పత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగం చేరే యువత నిబద్ధతతో పని చేసి సంస్థకు, వారి కుటుంబ ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్వోటూజీఎం రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం'

బెజ్జూర్: రావి శ్రీనివాస్ వర్గీయులు ఎమ్మెల్సీ దండే విఠల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు షేఖ్ముఖ చారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్షద్ హుస్సేన్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా ఉన్నప్పుడు 900 వందలకు మందికిపైగా రైతులకు రుణాలు ఇప్పించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రుణమాఫీ అయ్యేలా చూశారన్నారు. గ్రామాలకు లారీలు పంపి యూరియా పంపిణీ చేశారని పేర్కొన్నారు. కరోనా కాలంలో ప్రజ లకు నిత్యావసర సరుకులను సొంత ఖర్చుతో పంపిణీ చేశారని తెలిపారు. అనుచిత వ్యాఖ్యలు చేయ డం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.